క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల విరాళం



స్కూల్ యాజమాన్యానికి సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శనివారం రూ.10 వేలు విరాళం అందించారు. 2003–04లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు జనవరి 16న సమావేశమయ్యారు. తాము చదువుకున్న స్కూల్‌కు సహాయం అందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా సేకరించిన మొత్తాన్ని స్కూల్ యాజమాన్యానికి అందజేశారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఇటికాలమ్మ జాతర

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ అమ్మవారి జాతరను ఆదివారం రాత్రి నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కామిశెట్టి పండు, గంధ్రోతు శ్రీనివాసరావు తెలిపారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థం నిర్వహిస్తారన్నారు.

కోడు కాలువకు మోక్షం



యంత్రం సాయంతో జరుగుతున్న కోడు కాలువ పూడికతీత పనులు

ఆలమూరు: ఆలమూరు నుంచి పెనికేరు వెళ్లే రహదారిలోని కోడు కాలువకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని సుమారు పది గ్రామాలకు ఉపయోగపడే ఈ పంటకాలువ గత 20 ఏళ్ల నుంచి అధునీకరించకపోవడంతో గుర్రపుడెక్క, తూటుకాడతో మూసుకుపోయింది. దీనిపై రైతులు ఇచ్చిన ఫిర్యాదుతో చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు, ఎస్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ చైర్మన్ గారపాటి శ్రీనివాస చౌదరి స్పందించి అధికారుల సహకారంతో శనివారం పూడికతీత పనులను ప్రారంభించారు. రాబోయే ఖరీఫ్‌కు కోడు కాలువను పూర్తిస్థాయిలో ఆధునీకరించి, ఆక్రమణలను తొలగించి రైతులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ గారపాటి హామీ ఇచ్చారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



సఖినేటిపల్లిలంకలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకలోని లేసు భవనంలో ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచితకుట్టు శిక్షణ కేంద్రాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో ఎంపిక చేసిన 135 మంది మహిళలకు ఉచితకుట్టు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు అందరూ స్వయం ఉపాధి పొందాలని ఆయన సూచించారు. రేపూరి ఏసు నరసింహ రాజా, ఎంపీపీ వీరా మల్లిబాబు, గుబ్బల ఫణి, కూటమి నేతలు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం తొలగింపు



అంతర్వేదిలో అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న దేవస్థానం అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం పరిధిలోని అంతర్వేది గ్రామంలో సర్వే నెం.991–2లోని భూమిలో ఒక వ్యక్తి చేపట్టిన అనధికార నిర్మాణాన్ని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో తొలగించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సహకారంతో సదరు నిర్మాణం తొలగింపులో ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు, ఎండోమెంట్స్ ఈఓ ఎస్.ప్రసాదరాజు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన ఆరోగ్య రక్షణకు గత ప్రభుత్వం నియమించిన సీహెచ్‌ఓలు చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ క్లినిక్) ఏర్పాటు చేసి అందులో మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా సేవలందిస్తున్న సీహెచ్‌ఓలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దీర్ఘకాలికంగా సమ్మె కొనసాగుతుంది. దీంతో గ్రామాల్లో వైద్యసేవలు కుంటుపడుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీనివల్ల మండలంలోని అనేక గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు మూతబడ్డాయి.

అన్నదాతల ఆక్రందన

- అకాల వర్షాలతో రైతుకు తీవ్ర నష్టం
- రోడ్లపై తడిసిన ధాన్యం ఆరబోత
- కొనుగోళ్లు లేక ఆందోళన



సంధిపూడిలో అకాల వర్షాలకు ధాన్యం రాశుల్లో చేరిన నీరు



చింతలూరులో ఆరబెట్టిన ధాన్యం

ఆలమూరు: వేసవిలో కురుస్తున్న వర్షాలు రైతుల పాలిట శాపంగా పరిణమించాయి. ధాన్యం కొనుగోళ్లు లేక తీవ్ర సతమతమవుతున్న రైతులకు అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల తమ నోటికి అందిన కూడు నోటికి దక్కకుండా పోతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతుంది. ఈ వారంలో రెండుసార్లు కురిసిన భారీ వర్షాల వల్ల ధాన్యం రాశుల్లోకి వర్షపునీరు చేరడంతో ధాన్యం రంగు మారిపోతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించేందుకు ఆరబెట్టడం కోసం బరకాలు కప్పి ఏర్పాటు చేసుకున్న ధాన్యపు రాశులు శుక్రవారం కురిసిన భారీ వర్షానికి తడిసి ముద్దవడంతో రైతన్నలు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో బరకాల్లో కప్పి ఉంచిన ధాన్యం రాశులను శనివారం మళ్లీ తెరిచి రోడ్లపైకి చేరవేసి ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం తీసుకుంటున్న అస్తవ్యస్త నిర్ణయాల వల్ల కౌలు రైతులు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ధాన్యాన్ని వ్యయ ప్రయాసలతో రోజుల తరబడి ఆరబెట్టలేక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇదే అదనుగా రైతుల ఇబ్బందులను ఆసరాగా తీసుకుంటున్న దళారులు రబీ ధాన్యాన్ని అయిన కాడికి కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఇప్పటి వరకూ రూ.1725 ధర పలికిన ధాన్యం ప్రస్తుతం రూ.1500 పలుకుతుంది.

కలవరపెడుతున్న వాతావరణం

కోస్తా ప్రాంతంలో వర్షాల ప్రభావం అధికంగా ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతులు తీవ్ర కలవరపాటుకు గురవుతున్నారు. మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియడంతో రోడ్లపై ఉంచిన ధాన్యాన్ని ఏ విధంగా ఒబ్బిడి చేసుకోవాలో తెలియక తికమక పడుతున్నారు. తడిచిన ధాన్యం ఆరిపోతే ఎలాగోలా కాపాడుకోవచ్చని, కోతలు పూర్తి కాని పంట ఏమైపోతుందోనని రైతులు భయపడుతున్నారు. వాతావరణ శాఖ చెప్పినట్లుగా మళ్లీ వర్షాలు కురిస్తే ఇక చేతికి అందిన పంట దక్కే అవకాశం లేక పూర్తిస్థాయిలో నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. క్లస్టర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మబ్బులు వీడి ఎండ రావడంతో రైతులు ధాన్యాన్ని ఆత్రుతగా ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

ధాన్యం కొనుగోలుకు ఆర్‌ఎస్‌కేలు ససేమిరా

రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్కేలు) ససేమిరా అంటున్నాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ ఇచ్చిన ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయిందని, మళ్లీ అనుమతులు వచ్చే వరకూ కొనుగోళ్లకు ఎదురు చూడక తప్పదని వ్యవసాయ క్షేత్ర సహాయకులు చెబుతున్నారు. క్లస్టర్ల పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు సుమారు 58 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా 2.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో సుమారు 40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తొలుత లక్ష్యంగా నిర్ణయించుకున్న ప్రభుత్వం అర్ధాంతరంగా కొనుగోళ్లను నిలిపివేసింది. దీంతో రైతులు ధాన్యాన్ని అమ్ముకోలేక, అలాగని నిల్వ చేసేందుకు గిడ్డంగులు లేక కళ్లాల మీద, రోడ్ల మీదనే ధాన్యాన్ని రాశులుగా పోసి బరకాలు కప్పి ఉంచుతున్నారు. ధాన్యం కొనుగోలులో అమలవుతున్న కఠిన నిబంధనలతో పాటు అనుమతులు పేరిట అధికారులు చేస్తున్న జాప్యం రైతుల పాలిట శాపంగా మారింది.

ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అంబాజీపేటలో విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ ప్రకాష్

అంబాజీపేట: వేసవిలో విద్యార్థులకు అవసరమయ్యే చదువు, క్రీడలకు సంబంధించిన ఉచిత శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మోకా ప్రకాష్ కోరారు. హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులను హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ ప్రకాష్ మాట్లాడుతూ 30 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే పెన్నులు, పుస్తకాలతో పాటు ఇంగ్లిష్ మెటీరియల్‌ను విద్యార్థులకు వినాయక యాడ్స్ అధినేత బి.వినాయకరావు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఉపాధ్యాయులు బీఎస్‌ఎన్ మూర్తి, బొంతు రమేష్, మేడిద జాని పాల్గొన్నారు.

కుట్టుమెషీన్ల పథకంతో భారీ అవినీతికి తెర



రాజోలులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శైలజ, మహిళా నాయకులు

రాజోలు: కుట్టుమెషీన్ల పథకంతో కూటమి ప్రభుత్వం భారీ అవినీతికి తెర తీసిందని రాజోలు జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ అన్నారు. శనివారం రాజోలులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళలకు కుట్టు మెషీన్ల శిక్షణ ఇచ్చి, కుట్టుమెషీన్ ఇస్తామని చెప్పి టెండర్ల దశలోనే నిధులు మళ్లించే కార్యక్రమం చేపట్టారన్నారు. అనుభవం లేని కంపెనీలకు టెండర్లు అప్పగించారని కొన్ని చోట్ల మహిళలకు శిక్షణ కూడా ప్రారంభించలేదన్నారు. కుట్టు శిక్షణ యూనిట్‌కు రూ.21,798 కేటాయించగా దీనిలో రూ.15 వేలకు పైగా కాజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. లబ్ధిదార మహిళలకు కేవలం రూ.7 వేలు మాత్రమే చేరుతుందన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా రూ.154 కోట్లు కాజేస్తున్నారని ఆరోపించారు. మహిళలకు టైలరింగ్ శిక్షణ, టైలరింగ్ కేంద్రం అద్దె, కుట్టుమెషీన్, ఇతర పరికరాలకు కేటాయించి 45 రోజులు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే అలా చేయకుండా తూతూమంత్రంగా శిక్షణ ఇచ్చి కుట్టుమెషీన్ నిధులు పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పేరు గాంచిన కంపెనీలు అయిన ఉషా, మెరిట్, సింగార్, పూజా కంపెనీలు కాకుండా అతి తక్కువ ధరలో గుజరాత్ నుంచి తీసుకుని వచ్చిన కుట్టుమెషీన్లను మహిళలకు అంటగడుతున్నారన్నారు. ఈ కుట్టుమెషీన్ల పథకంలో జరిగిన తప్పుడు అంశాలపై సీబీఐ ద్వారా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజోలు నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఎస్తేరు రాణి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత పాల్గొన్నారు.

గొల్లపాలెంలో మాక్ డ్రిల్



గొల్లపాలెంలో నిర్వహించిన మాక్ డ్రిల్

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో శనివారం అంతర్వేది మెరైన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ, మలికిపురం పోలీసు సిబ్బంది, ఎస్పీఎఫ్ బలగాలతో కలసి ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన వారు మాక్ డ్రిల్ చేసి అవగాహన కల్పించారు. మెరైన్ ఇన్‌స్పెక్టర్ నవీన్ నరసింహమూర్తి, మెరైన్ ఎస్సై నాగార్జునరాజు, సివిల్ ఎస్సై సురేష్, ఎస్పీఎఫ్ సీఐ, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు జయంతి



మామిడికుదురులో పీవీ రావుకు మాల మహానాడు నేతల నివాళి

మలికిపురం: మలికిపురం పూలే–అంబేడ్కర్ భవనంలో శనివారం రాజోలు నియోజకవర్గ ఎస్సీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో పీవీ రావు జయంతి వేడుకలు జరిగాయి. మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు మాట్లాడుతూ నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గెడ్డం తులసీభాస్కరరావు, చింతా రాజబాబు, గెడ్డం ఫిలిప్‌రాజు, గొల్ల జేసు రత్నం, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మాలల ఆత్మగౌరవం కోసం పోరాడిన నేత పీవీ రావు చిరస్మరణీయుడని మాల మహానాడు నేతలు ప్రస్తుతించారు. పీవీ రావు జయంతిని మామిడికుదురు శనివారం ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మాలల హక్కుల కోసం పోరాడుతూ తన ప్రాణాలను సైతం అర్పించారన్నారు. కార్యక్రమంలో భూపతి వెంకటపతి, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతి వేడుకలను అంబాజీపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి పులువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళర్పించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, నాగాబత్తుల నరసింహమూర్తి, ముత్తాబత్తుల ప్రశాంత్, నూకపెయ్యి చిన్న, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీ రావు జయంతిని స్థానిక అక్విడెక్టు పార్కులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు అధ్యక్షుడు యన్నపు పెద్ద, స్థానిక నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, గెడ్డం ప్రసాద్ పాల్గొన్నారు.

వేసవి బడి... ఆనందాల ఒడి



కొత్తపేటలో మాట్లాడుతున్న డీఈఓ సలీంబాషా

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల వేసవి శిక్షణ తరగతులు ఆనందాల ఆటల జ్ఞాపకాల ఒడిగా విద్యార్థుల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన డీఈఓ షేక్ సలీంబాషా అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గత నెల 24 నుంచి ఈ నెల 10 వరకు వేసవి బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షత వహించగా డీఈఓ సలీంబాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వేసవి బడి కార్యక్రమం ఆటలతో పాటు చిత్రలేఖనం, కళలు, రేపటి తరగతికి కావలసిన విజ్ఞానం అందజేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైందని డీఈఓ అభినందించారు. శిక్షణకు 93 మంది విద్యార్థులు హాజరు కాగా వారికి తరగతి వారీగా టెస్టులు నిర్వహించారు. ఆ విజేతలకు, అలాగే ఈ శిక్షణలో 17 రోజుల పాటు స్వచ్ఛందంగా వచ్చి విద్యార్థులకు ఆటపాటలతో విజ్ఞానాన్ని అందించిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఏఆర్‌వీ కృష్ణ (తెలుగు), కె.ధర్మరాజు (ఆంగ్లం), ఎస్.ప్రవీణ్ (హిందీ), డి.శ్రీకాంత్ (గణితం), బి.నారాయణరావు (భౌతిక శాస్త్రం), బి.శేషగిరిరావు, ఖాజా మొహిద్దీన్ (బయలాజికల్ సైన్స్)లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.లీలావతి, పాఠశాల హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ, కో ఆర్డినేటర్ బి.నారాయణరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్, సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గత నెల 10 తేదీ నుంచి శనివారం వరకూ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

అమ్మను మించిన దైవం లేదు



ఆలమూరులో తల్లికి వందనంలో తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు



సోంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

ఆలమూరు: అమ్మతనం కన్నా కమ్మనైనది ఈ సృష్టిలో లేదని, అమ్మను అందరూ దైవంగా ఆరాధించి పూజించాలని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మదర్స్ డే పురస్కరించుకుని ఒక రోజు ముందుగా మండల కేంద్రమైన ఆలమూరులో గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సీడీపీఓ గజలక్ష్మి ప్రారంభించారు. స్థానిక యానాదులపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లికి వందనం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. అంగన్‌వాడీ చిన్నారులందరూ తమ తల్లులకు కాళ్లు కడిగి పాదపూజ చేసి ఆశీర్వచనాలు అందుకున్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ శాఖ ఆదేశాల మేరకు తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు.

సీనియర్ హెల్పర్ రత్నంకు సత్కారం

మదర్స్ డేను పురస్కరించుకుని ఆలమూరు శివారు యానాదులపేటలోని 168 అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న సీనియర్ హెల్పర్ గంధం రత్నంకు సత్కారం జరిగింది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సుమారు 35 ఏళ్ల నుంచి సుదీర్ఘంగా సేవలను అందిస్తున్న ఆమెను గ్రామస్తుల సమక్షంలో గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తలు దుశ్శాలువా కప్పి నూతన వస్త్రాలు, పూలు, పండ్లను అందజేసి ఘనంగా సత్కరించారు.

రాజోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రాజోలు ఐసీడీఎస్ పరిధిలోని సోంపల్లి మెయిన్, బి.సావరం, పొన్నమండ, రాజోలు సుందరమ్మ చెరువు గట్టు, రాజోలు పల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు తమ తల్లులకు పాదపూజలు చేయగా పిల్లలను ఆశీర్వదించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు క్రాంతికుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.దుర్గాభవానీ, బి.సబిత, పి.సుశీల, సావిత్రి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అమ్మ పదానికి సార్థకత కన్నమ్మ



కత్తిమండ కన్నమ్మ

సఖినేటిపల్లి: స్వగ్రామంలో పేదలకు ఇంటింటా ఉచిత వైద్య సేవలందిస్తూ డాక్టర్ కన్నమ్మగా పేరొంది అమ్మ పదానికి సార్థకత చేకూర్చారు. సఖినేటిపల్లికి చెందిన కత్తిమండ కన్నమ్మ. నాడు ఆసుపత్రి వెళ్లేందుకు స్తోమత లేని పేదల పాలిట ఆమె ఉచిత వైద్యం ఒక వరం. ప్రస్తుతం ఎనిమిది పదుల వయస్సులో ఉన్న ఆమె ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం పురస్కరించుకుని శనివారం చెప్పిన విషయాలు ఇలా. వృత్తి రీత్యా స్టాఫ్ నర్సుగా కాకినాడ జీజీహెచ్‌లో పనిచేసి, స్వగ్రామంలో పేదలకు వైద్యసేవలు అందించాలన్న దృక్పథంతో స్టాఫ్ నర్సు ఉద్యోగం వదిలి ఇంటి బాట పట్టారు కన్నమ్మ. భర్త కత్తిమండ ప్రభాకర్‌రావు స్వగ్రామంలో అప్పటికే ఆర్‌ఎంపీగా ఉన్న విశేష అనుభవం ఆమెకు కలసి వచ్చింది. అప్పట్లో వైద్య సేవలు అందుబాటులో లేని రోజులలో వీరిరువురు ఎందరికో ఇంటింటికీ వెళ్లి వైద్యం సాయం అందించారు. ఆమె చేతుల్లో ఎంతో మంది మహిళలు పురుడు పోసుకున్నారు. అర్ధరాత్రి తలుపు తడితే చాలు వైద్య సేవలందించడంతో ఎంతో చొరవ చూపేవారు కన్నమ్మ. ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా, ప్రసూతి అవసరాలు వచ్చినా కన్నమ్మ హస్తవాసికోసం ఎదురు చూసేవారు. ఆమె అందించే వైద్య సేవలతో వారికి ఎంతో ఊరట కలిగేది. కాగా వయస్సు రీత్యా ఇంటింటా వైద్య సేవలు అందించడానికి అవకాశం లేకపోయినా, తన చుట్టూ ఉన్న పేదలకు మాత్రం స్వీయ వైద్య అనుభవంతో వైద్యం సేవలు అందిస్తున్నానన్నారు.

ఘనంగా షిర్డీ సాయి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: గంగలకుర్రు సాయినగర్‌లో నేదునూరి నాగేశ్వరరావు, వెంకటరమణి దంపతులతో షిర్డీ సాయినాథ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. సాయినాథ స్వామికి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరుణలు, రక్షా బంధాలు, పంచగవ్యప్రాశన, మంటపారాధన, పుష్పాధివాసాలు చేశారు. ఆదివారం ఉదయం సాయినాథ స్వామి విగ్రహంను ప్రతిష్ఠించనున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టనున్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రు శివారు వాకాడవారిపాలెంలో సీతారామ ఆలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేద పండితులు ముళ్ళపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, మహిళా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే ప్రస్తుతం భారత్–పాక్ దేశాల మధ్య యుద్ధం నేపథ్యంలో భారతదేశ విజయం కొరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భజన నిర్వహించారు.

రాజగోపాలస్వామికి పూజలు

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాల స్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా రెండో రోజైన శనివారం మిర్తిపాటి సంతతితో సేవా కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు విసనకర్రలు, పండ్లు, పానకం పంపిణీ చేశారు. మహిళలకు రవికలు, స్తోత్ర రత్నావళి పుస్తకాలను అందజేశారు. ఆలయ అర్చక స్వామి ఖండవల్లి అనంతాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అంతర్వేది ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీ



అంతర్వేది ఆలయ వాహనశాలలో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలపై బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. భారత్, పాక్ యుద్ధ వాతావరణం దృష్ట్యా సఖినేటిపల్లి ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పర్యవేక్షణలో బాంబ్ స్క్వాడ్ సిబ్బంది వివిధ ప్రదేశాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అదే విధంగా ఆలయంలో భక్తులను, సిబ్బందిని మరింత అప్రమత్తం స్క్వాడ్ సిబ్బంది చేశారు.

గుడ్‌విల్ సేవలు అభినందనీయం

రాజోలు: గుడ్‌విల్ సంస్థ సేవలు అభినందనీయమని పలువురు నాయకులు అన్నారు. శనివారం పొదలాడలో గుడ్‌విల్ సంస్థ ఆధ్వర్యంలో వితంతువులు, వృద్ధుల హోంను ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ కందికట్టు చంద్రశేఖరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. పట్టపు శ్యాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఇంజేటి ప్రశాంతి రోజా ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నాయకులు బత్తుల రాము, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

2025 డీఎస్సీలో ఉర్దూ పోస్టులు భర్తీ చేయాలి



పి.గన్నవరంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పి.గన్నవరం: డీఎస్సీ 2025లో ఉర్దూ ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ శనివారం పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ఉమ్మడి జిల్లా ముస్లిం, మైనార్టీ ఉర్దూ డీఎస్సీ అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. ఏడేళ్ల నుంచి ఈ పోస్టుల కోసం వేలాది మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని వారు వివరించారు. అయితే ఉమ్మడి జిల్లాలో ప్రకటించిన 1241 పోస్టుల్లో ఒక్క పోస్టు కూడా ఉర్దూకి కేటాయించలేదన్నారు. దీంతో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఉర్దూ అభ్యర్థులు తీవ్ర నిరాశ చెంది, మానసిక ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. ఎమ్మెల్యేని కలసిన వారిలో డీఎస్సీ ఉర్దూ అభ్యర్థులతో పాటు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు హాజీ ముకరం హుస్సేన్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఎం.సుభాన్, షానవాజ్ హుస్సేన్, మజీంద్రాని, షబ్బీర్ హుస్సేన్ ఉన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12,500 ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన ఆకుల లోవరాజు (31) రెండు రోజులు క్రితం నాగుల్లంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఒక కాలు తొడ భాగంలో మోకాలి కింది భాగంలో బాగా నలిగిపోయింది. ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ఇంకా రెండు ఆపరేషన్లు చేయాలని డాక్టర్లు చెప్పారు.

వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలోని లోవరాజు పిన్ని వెంకటలక్ష్మికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12,500 చెక్కును అందజేశారు.